
సాక్షి
ఖమ్మం
సోమవారం । 10 । ఫిబ్రవరి । 2025



ఆటలకు బేఫికర్

విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్న ప్రభుత్వం క్రీడా సామగ్రికి నిధులు విడుదల చేసింది. 8లో



జిల్లా అథ్లెటిక్స్ జట్లు సిద్ధం

జిల్లాస్థాయి అథ్లెటిక్స్ జట్లను ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఆదివారం ఎంపిక చేయగా 80 మంది హాజరయ్యారు. 8లో

గరిష్టం / కనిష్టం
34°/ 19°

వాతావరణం

జిల్లాలో సోమవారం పగటి ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతాయి. రాత్రి వాతావరణం కొంత చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఖమ్మం వాసికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న పుల్లంరాజు

ఖమ్మంఅర్బన్ : ఖమ్మం నగరానికి చెందిన టి.వి.పుల్లంరాజు సామాజిక సేవా విభాగంలో డాక్టరేట్ అందుకున్నారు. చెన్నైలోని రాజా అన్నామలై మందిరంలో అమెరికా సౌత్ వెస్టన్ యూనివర్సిటీ వారు ఆదివారం నిర్వహించిన స్నాతకోత్సవంలో తమిళనాడు రాష్ట్ర మాజీ మంత్రి హెచ్.వి.హాండే, గ్లోబల్ అచీవర్స్ చైర్మన్ డాక్టర్ ఆర్ సెల్వం, జిల్లా మెజిస్ట్రేట్ హరిదాసు తదితరుల చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. హైస్కూల్‌లో చదువుతున్నప్పుడే పుల్లంరాజు విద్యార్థి సంఘ ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారు. 2000 సంవత్సరం నుంచి 2005 వరకు బయ్యారంలోని కోదండ రామాలయం అధ్యక్షుడిగా పనిచేసి ఆలయ అభివృద్ధికి కృషి చేశారు. 1993లో అయ్యప్ప మాల ధరించిన ఆయన స్వామివారి నిత్య పూజా విధానం పుస్తకాలను ముద్రించి భక్తులకు అందించారు. 2012లో ఖమ్మం శ్రీనగర్ కాలనీలో శ్రీ ధర్మశాస్తా అన్నదాన సేవాసమితిలో సభ్యులుగా చేరి 2016లో సంస్థను ట్రస్ట్‌గా రిజిస్ట్రేషన్ చేయించడంలో ప్రధాన పాత్ర పోషించారు. 2019లో మధురానగర్‌లో సాయినాథ మందిరం నిర్మాణంలో భాగస్వాములై ప్రస్తుతం ఆలయ కమిటీ సహాయ కార్యదర్శిగా పని చేస్తున్నారు. 2020లో అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ ట్రస్ట్‌లో చేరి జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, రాష్ట్ర కార్యదర్శి సేవలందించారు. శబరిమల వెళ్లే భక్తులకు కేరళలో నిర్వహించే అన్నదాన మందిర కమిటీకి జాయింట్ సెక్రటరీగా పనిచేస్తున్నారు. ఇలా ఆయన సేవలను గుర్తించి డాక్టరేట్ ప్రదానం చేశారు.

కార్పొరేట్ స్థాయి వైద్య సేవలే లక్ష్యం



వైద్య సేవలపై ఆరా తీస్తున్న రాజశేఖర్ గౌడ్

నేలకొండపల్లి : జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్.కె.రాజశేఖర్‌గౌడ్ అన్నారు. స్థానిక సీహెచ్‌సీని ఆదివారం ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. జిల్లాలో ఎక్కడా మందుల కొరత లేదన్నారు. ప్రతీ ఆస్పత్రికి వచ్చే మందులను ఈ-ఔషధ్ పోర్టల్‌లో నమోదు చేయిస్తున్నామని చెప్పారు. ఆస్పత్రుల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. నేలకొండపల్లి సీహెచ్‌సీకి ప్రహరీ, ఆర్‌ఓ ప్లాంట్ కావాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రఘురాంరెడ్డిని కోరగానే స్పందించి నిధులు మంజూరు చేయించారని తెలిపారు.

సత్తా చాటిన ఉమ్మడి జిల్లా అథ్లెట్లు




పతకాలు సాధించిన సింధు, మైథిలి

ఖమ్మం స్పోర్ట్స్ : జాతీయ క్రీడోత్సవాల్లో అథ్లెటిక్స్ విభాగంలో 4X100 రిలే పరుగులో ఉమ్మడి జిల్లా మహిళా అథ్లెట్లు సత్తా చాటారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించిన ఎ.మైథిలీ(ఖమ్మం), మాలోతు సింధు(కొత్తగూడెం) తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకాలు దక్కించుకున్నారు. 4X100 రిలే పరుగు లక్ష్యాన్ని 47.58 సెకన్లలో పూర్తి చేశారు. జాతీయ క్రీడల్లో రాణించిన అథ్లెట్లను డీవైఎస్‌ఓలు టి.సునీల్‌కుమార్‌రెడ్డి, ఎం.పరంధామరెడ్డి, జిల్లా అథ్లెటిక్స్ కార్యదర్శులు కె.మహిధర్, ఎం.డీ.షఫీక్ అహ్మద్, కోచ్ ఎం.డీ గౌస్ అభినందించారు.

‘స్థానిక’ సందఢీ

ఎంపీటీసీ, జెడ్పీటీసీ, జీపీ ఎన్నికలపై పార్టీల గురి



స్థానిక సంస్థల సమరానికి రాజకీయ పార్టీలు అస్త్రశస్త్రాలకు పదును పెడుతున్నాయి. ప్రధానంగా గ్రామస్థాయి నేతలు రెట్టించిన ఉత్సాహంతో పోటీకి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. రిజర్వేషన్లు ఖరారైతే తాము ఎక్కడి నుంచి పోటీ చేయాలో తేల్చుకునేందుకు కొందరు నేతలు వేచి చూసే ధోరణిలో ఉన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు పార్టీల గుర్తుపై, గ్రామ పంచాయతీ ఎన్నికలు పార్టీల మద్దతుతో స్వతంత్ర గుర్తులపై జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న రాజకీయ పార్టీలు వ్యూహం రచిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ మండల నాయకులతో సమావేశాలు నిర్వహిస్తోంది. బీఆర్‌ఎస్ చాపకింద నీరులా ఎన్నికలకు సిద్ధం అవుతోంది. ఒంటరిగా పోటీ చేస్తామని సీపీఎం ఇప్పటికే ప్రకటించగా.. సీపీఐ ఎటువైపు నడుస్తుందో వేచి చూడాలి. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పట్టున్న ప్రాంతాల్లో బలనిరూపణకు కసరత్తు చేస్తోంది. బీజేపీ క్షేత్రస్థాయిలో బలం పెంచుకోవాలనే ఉద్దేశంతో ఈ ఎన్నికలపై నజర్ పెట్టింది.

– సాక్షి ప్రతినిధి, ఖమ్మం

- రెట్టించిన ఉత్సాహంతో కాంగ్రెస్
- సత్తా చాటేందుకు సిద్ధమవుతున్న బీఆర్‌ఎస్
- పూర్వ వైభవం కోసం కమ్యూనిస్టుల ఆరాటం
- పట్టు సాధించేందుకు బీజేపీ యత్నం

ఉనికి కోసం బీజేపీ ఆరాటం..

తమ ఉనికిని చాటుకునేందుకు భారతీయ జనతా పార్టీ ఆరాట పడుతోంది. జిల్లాలో బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు గతంలో బీజేపీ తీవ్రంగా ప్రయత్నించింది. అయితే ఆ చర్యలు సత్ఫలితాలు ఇవ్వలేదు. కేవలం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చరిష్మాతోనే ఎన్నికల్లో సీట్లు సంపాదించాలనే ఉద్దేశంతో ఆ పార్టీ ఉన్నట్లు కనిపిస్తోంది. దీంతోనే ప్రచారంలో ఆదరణ లభిస్తున్నప్పటికీ.. ఓట్ల రూపంలోకి మారడం లేదు. జిల్లా నాయకత్వం కూడా ప్రజాక్షేత్రంలో ఉండటంపై ఆసక్తి చూపడం లేదనే విమర్శలున్నాయి. వీటన్నింటి క్రమంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ ఏ మాత్రం ప్రభావం చూపుతుందనే చర్చలు జరుగుతున్నాయి. పార్టీకి క్షేత్రస్థాయిలో అంతగా బలం లేకపోవడంతో ఈ ఎన్నికల్లో ఆ పార్టీ ప్రభావం ఎలా ఉంటుందో స్థానిక ఫలితాలతో తేలనుంది.

కార్యకర్తలతో కాంగ్రెస్..

అధికార కాంగ్రెస్ పార్టీ అందరి కంటే ముందే స్థానిక ఎన్నికలకు సిద్ధమవుతోంది. రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి దోహదం చేసిన ఈ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఆధిక్యత ప్రదర్శించాలనే లక్ష్యంతో మంత్రులు ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉండడంతో మండల, గ్రామ స్థాయి నాయకత్వంతో ఎన్నికల్లో పనిచేయించడం సమస్య కాదని భావిస్తున్నారు. ఆ పార్టీకి చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు ఎన్నికల్లో పోటీకి సై అంటున్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామపంచాయతీ.. ఇలా ఏదో ఒక ఎన్నికల్లో పోటీ చేయాలని ఆశావహులు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఈ క్రమంలో గ్రామస్థాయిలో పార్టీలో విభేదాలు తలెత్తకుండా జిల్లా నాయకత్వం సమన్వయం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇప్పటికే మండల స్థాయి నేతలతో సమావేశాలు నిర్వహించి స్థానిక సంస్థల ఎన్నికలు ఎలా ఎదుర్కోవాలో దిశానిర్దేశం చేశారు. మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్థానిక సంస్థల ఎన్నికలకు నేతలను సన్నద్ధం చేసేందుకు ఆదివారం ఖమ్మంలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు.

బలపడేందుకు బీఆర్‌ఎస్ వ్యూహం..

గత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలతోపాటు గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్ అత్యధిక స్థానాలను గెలుచుకుంది. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితోపాటు జిల్లాలో కూడా ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. జిల్లాలో ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయింది. గత ఎన్నికల వరకు జిల్లాలో బలమైన పార్టీగా ఉన్న బీఆర్‌ఎస్ ఈసారి కొంత ఎదురీదుతోంది. ఈ ఎన్నికలతో పుంజుకోవాలనే ఉద్దేశంతో పార్టీ నాయకత్వం ఉంది. స్థానిక ఎన్నికల్లో బలమైన అభ్యర్థులను నిలిపేందుకు ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించింది. జిల్లాలో ప్రస్తుతం గడ్డు పరిస్థితి ఉన్నా.. మొక్కవోని దీక్షతో పనిచేసి సత్తా చాటాలని జిల్లా నేతలు కార్యకర్తలు, మండల నాయకులకు హితబోధ చేస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్న ఆశావహులు తమ ప్రయత్నాలను ప్రారంభించారు. రిజర్వేషన్లు ఖరారు కాకపోవడంతో అభ్యర్థులు ఎవరు ఎక్కడి నుంచి పోటీ చేయాలనే దానిపై ఇంకా ఓ నిర్ణయానికి రాలేకపోతున్నారు. రిజర్వేషన్లు ఖరారైతే బీఆర్‌ఎస్ నేతలు కూడా పూర్తిస్థాయిలో ఎన్నికల వ్యూహరచనల్లో మునిగే అవకాశం ఉంది. స్థానిక ఎన్నికల్లో గత ఫలితాలను పునరావృతం చేయాలనే ఉత్సాహంతో పని చేసేందుకు సిద్ధమవుతున్నారు.

ఎర్రజెండా ఎగరేయాలని..

కమ్యూనిస్టు పార్టీలకు గ్రామీణ ప్రాంతాల్లో పట్టు ఉంది. క్షేత్రస్థాయి సమస్యలపై ఆ పార్టీలు ఆందోళనలు నిర్వహిస్తూ అధికారంలో ఉన్న పార్టీలకు నిరసన గళం వినిపిస్తున్నాయి. ఈ బలంతో స్థానిక ఎన్నికల్లో సత్తా చాటి మళ్లీ జిల్లాలో పుంజుకోవాలని కమ్యూనిస్టు పార్టీలు వ్యూహరచన చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే సీపీఎం, సీపీఐలు కలిసి పోటీ చేస్తాయా.. విడివిడిగానా అన్నది ఇంకా తేలలేదు. సీపీఎం మాత్రం తాము ఒంటరిగానే బరిలో దిగుతామని ప్రకటించింది. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేసిన సీపీఐ ఈ ఎన్నికల్లో ఏం నిర్ణయం తీసుకుంటుందో ఇంకా తేలలేదు. చట్ట సభల్లో ప్రాతినిధ్యం ఉండాలని కోరుకుంటున్న కమ్యూనిస్టు పార్టీలు.. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పోటీ చేసి తమ పట్టు పెంచుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇప్పటి నుంచే సమస్యలపై పోరాడటంతో పాటు స్థానిక నాయకత్వంతో సమావేశాలు నిర్వహిస్తున్నాయి.

ఎన్నికల్లో సత్తా చాటాలి



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

- కష్టపడే కార్యకర్తలకే ప్రాధాన్యం
- ఎన్నికల్లో క్రమశిక్షణ తప్పితే ఉపేక్షించం
- ఖమ్మం నియోజకవర్గ సమావేశంలో మంత్రి తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలిచి సత్తా చాటాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మం నియోజకవర్గ స్థాయి ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సర కాలంగా చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అత్యధిక స్థానాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు. ప్రజామోదం ఉన్న నేతలను ఎన్నుకుని గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. తల్లి లాంటి పార్టీ కోసం ప్రతి ఒక్కరూ కష్టించి పనిచేయాలన్నారు. సొంత పార్టీలో ఉండి ఎదుటి వారికి సహకరిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఖమ్మం నియోజకవర్గంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. అరాచక శక్తులు లేని ప్రగతిశీల పాలనను ఖమ్మం ప్రజలు స్వాగతించారని, అదే స్ఫూర్తితో ముందుకు సాగుతూ అభివృద్ధి కాముకులను ఎన్నుకోవాలని కోరారు. తాము అధికారంలోకి రాగానే అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్దుల్లా ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కష్టపడిన కార్యకర్తలకు గౌరవం కల్పించే అవకాశం ఈ ఎన్నికలతో వచ్చిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో దేశంలో ఎక్కడా లేని కార్యక్రమాలు చేపడుతూ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం సహకరించకున్నా సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను ధైర్యంగా అమలు చేస్తున్నామని తెలిపారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన తెలంగాణను అభివృద్ధి, సంక్షేమం వైపు మళ్లించిన ఘనత రేవంత్‌రెడ్డికి దక్కుతుందన్నారు. సమావేశంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహర, కార్పొరేటర్ కమర్తపు మురళి, నాయకులు సాధు రమేష్‌రెడ్డి, నల్లమల వెంకటేశ్వరరావు, దీప్లా నాయక్, తాతా రఘురాం, హరిసింగ్, గుత్తా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

2,671.80 క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లు

జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్

ఖమ్మం సహకారనగర్ : జిల్లాలో ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించిన నేపథ్యంలో వైరా, బోనకల్ మండలాల్లోని 31 మంది రైతుల నుంచి 2,671.80 క్వింటాళ్ల ధాన్యం సేకరించినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైరా మండలంలో 2,047.20, బోనకల్‌లో 624.60 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయగా ఆయా మండలాల్లో ఆదివారంతో ధాన్యం కొనుగోళ్లు ముగిశాయని వివరించారు. ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశంతో 31 మంది రైతులు లబ్ధి పొందారని పేర్కొన్నారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామివారి మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

హాస్టళ్లలో సురక్షిత నీరు

- ఎస్సీ వసతిగృహాల్లో నీటిశుద్ధి యంత్రాలు
- జిల్లాలో 52 హాస్టళ్లలో ఏర్పాటు చేస్తున్న అధికారులు
- కలెక్టర్, అదనపు కలెక్టర్ ప్రత్యేక చొరవ



ఖమ్మం ఎస్సీ బాలుర హాస్టల్‌లో శుద్ధిచేసిన నీటిని పడుతున్న కస్తాల సత్యనారాయణ

ఖమ్మంమయూరిసెంటర్ : ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో ఉంటూ చదువుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు మెరుగైన వసతి, నాణ్యమైన భోజనం తదితర సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. జిల్లా అధికారులు సైతం నిరంతరం ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలు, గురుకులాలను సందర్శిస్తూ విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్నారు. ఈ క్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ప్రతిపాదన, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సహకారంతో జిల్లాలోని ఎస్సీ సంక్షేమ వసతిగృహాల్లో తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. నీటి శుద్ధి పరికరాలు ఏర్పాటు చేస్తుండగా సుమారు నాలుగు వేల మంది విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందనుంది.

నల్లా నీటితోనే..

వసతిగృహాల్లో విద్యార్థులకు తాగునీరు అందించేందుకు మిషన్ భగీరథ నీటిని వినియోగిస్తున్నారు. కొన్ని హాస్టళ్లలో నల్లా కనెక్షన్లు ఉండగా.. మరి కొన్ని చోట్ల అవి కూడా లేక బోరు నీరే శరణ్యం. అవి కూడా లేని ప్రాంతాల్లో బయట నుంచి తాగునీటిని తెప్పిస్తున్నారు. జిల్లా అధికారులు వసతిగృహాల తనిఖీల సమయంలో ఈ విషయం వారి దృష్టికి వచ్చింది. దీంతో ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ వసతిగృహాలు, గురుకులాల్లో అత్యధికంగా మంచినీటి సమస్యపైనే నివేదికలు ఇవ్వగా దీనికి చెక్ పెట్టేందుకు కలెక్టర్, అదనపు కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు తెలిసింది.

52 వసతిగృహాల్లో..

ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో తాగునీటి శుద్ధి (వాటర్ ప్యూరిఫయర్) పరికరాల ఏర్పాటుకు అదనపు కలెక్టర్ శ్రీజ ప్రతిపాదనలు పంపగా కలెక్టర్ నిధులు మంజూరు చేసినట్లు తెలిసింది. దీంతో ఎస్సీ సంక్షేమ శాఖ డీడీ కస్తాల సత్యనారాయణ జిల్లాలోని 52 వసతిగృహాల్లో వీటి ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఒక్కో పరికరాన్ని రూ.10 వేల చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికి రూ.5.20 లక్షలతో 52 పరికరాలను కొనుగోలు చేసిన అధికారులు వసతిగృహాల్లో ఏర్పాటు చేయిస్తున్నారు. నగరంలోని ఎస్సీ కళాశాల బాలుర (ఏ), ఎస్సీ కళాశాల బాలుర (బీ) వసతిగృహాల్లో వీటిని ఏర్పాటు చేయించారు. ఆదివారం ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ వీటిని పరిశీలించారు. గంటకు 50 లీటర్ల వరకు తాగునీటిని ఈ పరికరం శుద్ధి చేస్తుందని అధికారులు తెలిపారు.

అన్ని హాస్టళ్లలో ఏర్పాటు చేస్తున్నాం..

జిల్లాలోని ఎస్సీ సంక్షేమ వసతిగృహాల్లో అన్నింటిలోనూ వాటర్ ప్యూరిఫయర్ పరికరాలు ఏర్పాటు చేస్తున్నాం. విద్యార్థులకు శుద్ధి చేసిన సురక్షిత నీటిని అందించడమే లక్ష్యం. కలెక్టర్, అదనపు కలెక్టర్ చొరవతో ఈ పరికరాలు ఏర్పాటు చేయగలుగుతున్నాం. వారం రోజుల్లో అన్ని హాస్టళ్లలోనూ ఏర్పాటు చేస్తాం.

–కస్తాల సత్యనారాయణ, ఎస్సీ డీడీ

కొనసాగుతున్న ప్రాక్టికల్ పరీక్షలు

ఖమ్మం సహకారనగర్ : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ఆదివారం కూడా జరిగాయి. ఉదయం పరీక్ష 35 కేంద్రాల్లో నిర్వహించగా 1,729 మందికి గాను 1,661మంది హాజరయ్యారు. 68 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్ష 29 కేంద్రాల్లో జరగగా 1,542 మందికి 1,482 మంది హాజరయ్యారని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవిబాబు తెలిపారు. 35 పరీక్షా కేంద్రాలను డీఈసీ, హెచ్‌పీ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయని పేర్కొన్నారు.

‘క్యాథ్‌ల్యాబ్’కు బాలారిష్టాలు

- తరచూ ఏర్పడుతున్న అంతరాయాలు
- అవసరమైన పరికరాల కొనుగోలుకు నిత్యం నిధుల కొరత
- శాశ్వత వైద్యుడి పోస్టు లేక డిప్యుటేషన్‌తో నెట్టుకొస్తున్న వైనం



పెద్దాస్పత్రిలోని క్యాథ్‌ల్యాబ్ యంత్రం

ఖమ్మం క్యాథ్‌ల్యాబ్ ద్వారా అందించిన సేవలు

	2022	2023	2024	2025 (ఇప్పటివరకు)
యాంజియోగ్రామ్	321	337	230	19
స్టంట్లు	135	283	239	19
ఇతర సేవలు	32	15	13	--

ఖమ్మంవైద్యవిభాగం: గుండె సంబంధిత రోగులకు భరోసా కల్పిస్తూ పెద్దాస్పత్రిలో కార్డియాలజీ విభాగాన్ని అందుబాటులోకి తెచ్చారు. క్యాథ్‌ల్యాబ్ మిషన్ సేవలు అందుబాటులోకి రావడంతో ఇక గుండెజబ్బు బాధితులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని అంతా అనుకున్నారు. కానీ 2022 సెప్టెంబర్‌లో ఈ సేవలు అందుబాటులోకి రాగా అప్పటి నుంచీ బాలారిష్టాలు ఎదురవుతూనే ఉన్నాయి. ఒక్కోసారి బాధితులకు గుండె సంబంధిత శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు అవసరమైన పరికరాలు లేక సేవలు నిలుస్తున్నాయి. కొనుగోలుకు నిధుల కొరత ఏర్పడుతుండగా తరచూ ఇక్కట్లు తప్పడం లేదు. సుమారు రూ.7 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన క్యాథ్‌ల్యాబ్ సేవలను సద్వినియోగం చేసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇతర ప్రాంతాలతో పోల్చితే జిల్లాలో కొన్నేళ్లుగా గుండె జబ్బులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలోని క్యాథ్‌ల్యాబ్ ద్వారా ఉమ్మడి జిల్లాతో పాటు సూర్యాపేట, మహబూబాబాద్ ప్రభుత్వ ఆస్పత్రులను అనుసంధానించి గుండెజబ్బు బాధితులకు సేవలందిస్తున్నారు. అయితే ఈ సేవలు అందక పేషెంట్లు తరచూ ఇబ్బంది పడుతున్నారు.

కొనుగోలుకు నిధుల కొరత..

పెద్దాస్పత్రిలోని క్యాథ్‌ల్యాబ్ మిషన్ ద్వారా ఇప్పటి వరకు 1,641 మందికి గుండె శస్త్ర చికిత్సలు నిర్వహించారు. తరచూ ఇబ్బందులు ఏర్పడకుంటే అంతకు రెట్టింపు సేవలు అందేవి. ఎంతో ప్రాముఖ్యత గల మిషన్ అందుబాటులో ఉన్నా తరచూ సేవలకు అంతరాయం కలుగుతోంది. ముఖ్యంగా శస్త్ర చికిత్సకు అవసరమైన పరికరాల కొనుగోలుకు నిధుల కొరత వేధిస్తోంది. కార్డియాలజీ విభాగంలో కరోనరీ యాంజియోగ్రామ్ శస్త్ర చికిత్సలతో పాటు, స్టంట్లు, బెలూన్ యాంజియోప్లాస్టీ, రెనల్ యాంజియోగ్రామ్, రూట్ యాంజియోగ్రామ్, కారోటిడ్ యాంజియోగ్రామ్, పెరిఫెరల్ యాంజియోగ్రామ్, బ్రాంకియల్ యాంజియోగ్రామ్, పెరీ కార్డియో సెంటెసిస్ వంటి సేవలు అందిస్తున్నారు. అంతరాయం ఏర్పడినప్పుడు మాత్రం సేవలు నిలిచిపోతున్నాయి. దీంతో కొందరు బాధితులు ప్రైవేటు బాట పడుతున్నారు. నిరుపేదలు మాత్రం చేసేది లేక ఇంటికి వెళ్లి ఇబ్బంది పడుతున్నారు. క్యాథ్‌ల్యాబ్ సేవలకు అవసరమైన కాంట్రాస్ట్, స్టంట్స్, బెలూన్, కేథర్స్, వైర్ తదితర వాటిని ప్రభుత్వమే కొనుగోలు చేసి పంపించాలి. కానీ ఖమ్మంలో అలా జరగడం లేదు. దీంతో ఈ ఆస్పత్రి నిధులతోనే కొనుగోలు చేయాల్సి వస్తోంది. నిధులు ఉన్నప్పుడు కొనుగోలు చేయడం, లేనప్పుడు చేతులెత్తేయడం ఇక్కడ సర్వసాధారణమైంది.

శాశ్వత వైద్యుడు లేకుండానే..

సాధారణంగా గుండె వైద్య నిపుణుడు, ఇతర సిబ్బంది పోస్టులు భర్తీ అయ్యాకే క్యాథ్‌ల్యాబ్ మిషన్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అయితే సిబ్బందితో సంబంధం లేకుండా పెద్దాస్పత్రిలో హడావిడిగా మిషన్ పెట్టారు. డిప్యుటేషన్‌పై ఓ వైద్యుడిని తీసుకొచ్చి సేవలు అందిస్తున్నారు. అలాగే నలుగురు టెక్నీషియన్లు, ఐదుగురు స్టాఫ్‌నర్సులు ఉండాలి. కానీ ప్రస్తుతం నలుగురు టెక్నీషియన్లు ఉన్నా.. స్టాఫ్‌నర్సులు మాత్రం ఇద్దరే విధులు నిర్వహిస్తున్నారు. క్యాథ్‌ల్యాబ్ సేవలు అందుబాటులో ఉన్నాయనే ఆశతో ఇక్కడ నిత్యం 70 మంది గుండెజబ్బు బాధితులు ఓపీ సేవలు పొందుతున్నారు. అలాగే రోజుకు సుమారు 100 మందికి టూడీఇకో సేవలు అందిస్తున్నారు.

ఇబ్బందులు ఎదురుకాకుండా సేవలు



అప్పుడప్పుడు సేవలకు అంతరాయం ఏర్పడుతున్నా బాధితులకు ఇబ్బంది కలగకుండా చూస్తున్నాం. పరికరాల కొరత వచ్చినప్పుడు సూపరింటెండెంట్‌తో మాట్లాడి స్థానికంగా కొనుగోలు చేస్తున్నాం. ఇక్కడ ఓపీ సేవలు కూడా పెరిగాయి. నాలుగు జిల్లాల నుంచి గుండె సంబంధిత బాధితులు వస్తుండడంతో సేవలు విస్తృతమయ్యాయి. ఇక్కడికి వచ్చినవారికి పూర్తిస్థాయిలో సేవలందించాకే పంపిస్తున్నాం. ఇబ్బందులు తలెత్తితే వెంటనే పరిష్కరిస్తున్నాం. ఇక ముందు క్యాథ్‌ల్యాబ్ సేవలు మరింత మెరుగుపడతాయి.

– డాక్టర్ సీతారాం, గుండె వైద్య నిపుణులు

క్లుప్తంగా

మాలధారుల పాదయాత్ర



పాదయాత్రకు ముందు పూజలు చేస్తున్న మాలధారులు

తిరుమలాయపాలెం: మండలంలోని జల్లెపల్లి గ్రామానికి చెందిన శ్రీలక్ష్మీతిరుపతమ్మ గోపయ్య స్వామి మాలధారణ చేసిన స్వాములు ఆదివారం పెనుగంచిప్రోలుకు కాలి నడకన బయలుదేరారు. ఇరుముడి కట్టుకుని, భజనలతో జల్లేపల్లి దేవాలయం నుంచి బయలుదేరగా.. అన్నిరకాల ఖర్చుల నిమిత్తం నగదను మాజీ ప్రజాప్రతినిధులు భాషబోయిన శైలజ, వీరన్న అందించారు.

12న ప్రతిభా పాటవ పరీక్ష

డీసీఈబీ సెక్రటరీ నారాయణ



మాట్లాడుతున్న నారాయణ

ఖమ్మంఅర్బన్ : పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 12న పదో తరగతి విద్యార్థులకు ప్రతిభాపాటవ పరీక్ష నిర్వహిస్తున్నట్లు డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు(డీసీఈబీ) కార్యదర్శి నారాయణ తెలిపారు. నగరంలోని రోటరీనగర్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పరీక్ష కార్యనిర్వాహక మండలి సమావేశం ట్రస్ట్ అధ్యక్షుడు పరిశ పుల్లయ్య ఆధ్వర్యంలో జరగగా, నారాయణ మాట్లాడారు. ఈ పరీక్ష 11వ తేదీనే జరగాల్సి ఉండగా, ఆరోజున ప్రధానోపాధ్యాయులకు ఎన్నికల శిక్షణ కార్యక్రమం ఉన్నందున 12కు వాయిదా వేసినట్లు తెలిపారు. సమావేశంలో ట్రస్ట్ సభ్యులు మహంకాళి స్వరాజ్యలక్ష్మి, టి.సుబ్బారావు, పరిశ రామ్మోహనరావు, ఎల్. వెంకట్రామిరెడ్డి, కనపర్తి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నాన్నపై ప్రేమతో..

విగ్రహం తయారుచేయించిన కుమారులు



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న గ్రామ, కుల సంఘం నాయకులు

ఇల్లెందురూరల్: రెక్కల కష్టంతో తమను ప్రయోజకులుగా తీర్చిదిద్దిన తండ్రిపై ప్రేమతో ఆయన రూపం చిరస్థాయిగా తమ ముందుండాలనే ఆకాంక్షతో విగ్రహాన్ని తయారు చేయించారు కుమారులు. ఇల్లెందు మండలం ధర్మారంతండాలో బోడా సేవా వర్ధంతిని పురస్కరించుకుని కుమారులు విగ్రహాన్ని సిద్ధం చేయగా గ్రామ, కుల పెద్దలు ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన సెంట్రల్ కమిటీ చైర్మన్ ధరావత్ ప్రేమ్‌చంద్‌నాయక్, వాంకుడోత్ రమేష్‌నాయక్, నాయకులు జర్పుల రామ్‌చంద్రునాయక్, ధారావత్ సురేష్‌నాయక్, లావుడ్యా వెంకటేష్, భూక్యా శ్రీను, బానోత్ రవీందర్, రమేష్, బానోత్ స్వామి, కుమారులు బోడ శ్రీను, బోడ రమేష్, బోడ చందులాల్, బోడ చిన్న, బోడ లక్ష్మణ్ పాల్గొన్నారు.

జామాయిల్ కర్రలు పట్టివేత



పట్టుబడిన ట్రాక్టర్‌తో అటవీశాఖ అధికారులు

జూలూరుపాడు: ఖమ్మం జిల్లా ఏన్కూర్ మండలం గంగులనాచారం గ్రామం రాజుపాలెం అటవీ బీట్ ప్లాంటేషన్‌లోని జామాయిల్ చెట్లు నరికి కర్రలను ట్రాక్టర్‌లో తరలిస్తుండగా ఆదివారం తెల్లవారుజామున అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. జామాయిల్ కర్రలను తరలిస్తున్నారనే సమాచారంతో అటవీ సెక్షన్ ఆఫీసర్ వి.మల్లయ్య, బీట్ ఆఫీసర్లు బి.నరసింహారావు, ఎస్.కె.రహీంలు ట్రాక్టర్ పట్టుకొని, జూలూరుపాడు ఎఫ్‌ఆర్‌ఓ కార్యాలయానికి తరలించారు. సురారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన ట్రాక్టర్‌లో జామాయిల్ కర్రలు తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎఫ్‌ఆర్‌ఓ జి.ప్రసాద్ రావు చెప్పారు. వీటి విలువ సుమారు రూ.15 వేలు ఉండొచ్చని, ట్రాక్టర్‌ను సీజ్ చేసి, విచారణ చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

పోస్టాఫీస్‌లో చోరీకి యత్నం

టేకులపల్లి: టేకులపల్లి మండల కేంద్రంలోని సబ్ పోస్టాఫీస్‌లో గుర్తు తెలియని ఓ దొంగ చోరీకి యత్నించాడు. టేకులపల్లి ఎస్‌ఐ పోగుల సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సబ్ పోస్టాఫీస్ తలుపులు ఆదివారం పగలకొట్టి ఉండడంతో ఇంటి యజమాని సబ్ పోస్టు మాస్టర్‌కు సమాచారం ఇచ్చాడు. దీంతో ఆయన వచ్చి ఆఫీస్ లోపల పరిశీలించగా.. లాకర్‌లోని సుమారు రూ.20వేల నగదు ఉన్నప్పటికీ కంప్యూటర్ మానిటర్, బార్‌కోడ్ స్కానర్ మాత్రం ధ్వంసమై ఉన్నాయి. విషయం తెలుసుకున్న పోస్టల్ సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ చిన్న యాకయ్య సందర్శించి ఘటనపై ఆరా తీశారు. సబ్ పోస్టు మాస్టర్ ప్రసాద్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆటలకు బేఫికర్



వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు(ఫైల్)

- ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా పరికరాల కొనుగోలుకు నిధులు మంజూరు
- భద్రాద్రి జిల్లాకు రూ.1.7 కోట్లు విడుదల
- ఖమ్మం జిల్లాకు రూ.1.11 కోట్లు కేటాయింపు
- విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఫండ్ అందించిన ప్రభుత్వం

పాల్వంచరూరల్: విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. క్రీడా సామగ్రి కొనుగోలుకు, పాఠశాలల నిర్వహణకు ఇటీవల నిధులు విడుదల చేసింది. 2024–2025 విద్యా సంవత్సరానికి ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, స్థానిక సంస్థలు, ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీలు, గిరిజన పాఠశాలలకు నిధులు కేటాయించింది. ఈ నిధులతో రోజువారీ కార్యక్రమాల నిర్వహణతోపాటు ఇంటర్‌నెట్, స్టేషనరీ, క్రీడాసామగ్రి కొనుగోలుకు వెసులుబాటు కల్పించింది.

ఉమ్మడి జిల్లాలో 2,116 పాఠశాలలలు

ఉమ్మడి జిల్లాలో 2,116 పాఠశాలలకు క్రీడా సామగ్రి కొనుగోలుకు రూ.2.18 కోట్లు మంజూరు చేసింది. ఇందులో భద్రాద్రి జిల్లాలోని 1,345 పాఠశాలలకు రూ.1.7 కోట్లు కేటాయించింది. ఇందులో1,021 ప్రాథమిక పాఠశాలలకు రూ.51.05 లక్షలు, 167 ప్రాథమికోన్నత పాఠశాలలకు రూ.16.70 లక్షలు, 157 ఉన్నత పాఠశాలలకు రూ.39.25 లక్షలు మంజూరు చేసింది. ఇక ఖమ్మం జిల్లాకు రూ.1.11 కోట్లు కేటాయించింది.

విద్యార్థుల సంఖ్య ఆధారంగా..

పాఠశాలల నిర్వహణకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు విడుదల చేసింది. 1నుంచి 30 మంది విద్యార్థులుంటే సంవత్సరానికి రూ.10 వేలు, 31నుంచి 100 మంది విద్యార్థులుంటే రూ.25 వేలు, 101 నుంచి 250 మంది ఉంటే రూ. 50 వేలు, 251నుంచి 1000 మంది ఉంటే రూ.75 వేలు, వెయ్యి మందికి పైగా విద్యార్థులుంటే రూ.లక్ష వరకు నిధులొస్తాయి. వాటిని ప్రభుత్వం రెండు విడుతల్లో అందించనుంది.

ఏఏ క్రీడాసామగ్రి కొనాలంటే..

మంజూరు చేసిన నిధులతో ఏఏ క్రీడాసామగ్రి కొనుగోలు చేయాలో ప్రభుత్వం నిర్దేశించింది. ఈ మేరకు ప్రధానోపాధ్యాయులకు మార్గదర్శకాలు విడుదల చేసింది. ప్రాథమిక పాఠశాలల్లో రెండు క్రికెట్ బ్యాట్లు, చిన్న సాఫ్ట్‌బాల్, నాలుగు టెన్నిస్ బంతులు, రెండు ఫుట్‌బాల్స్, ఒక బాస్కెట్‌బాల్, ఆరు స్కిప్పింగ్ రోప్స్, ఒక టెన్నీకాయిట్ రింగ్, ఒక ఐరన్ బాక్స్ కొనుగోలు చేయవచ్చు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో షాట్‌పుట్ ఒక్కటి, డిస్కస్‌త్రో ఒక్కటి, రెండు స్కిప్పింగ్ రోప్స్ రెండు, ఒక క్రికెట్ బ్యాట్, నాలుగు టెన్నిస్ బంతులు, వాలీబాల్ నెట్, బాల్, ఒక హ్యాండ్ బాల్, రెండు త్రోబాల్స్, ఒక ఫుట్‌బాల్, ఒక ఐరన్ ట్రంక్ బాక్స్, ఉన్నత పాఠశాల అయితే ఆరు స్కిప్పింగ్ రోప్స్ , నాలుగు షాట్‌పుట్, నాలుగు డిస్కస్ త్రో పరికరాలు, 20 బ్యాడ్మింటన్ బ్యాట్లు, నాలుగు ,క్రికెట్ బ్యాట్లు, 20 టెన్నిస్ బంతులు, రెండు త్రోబాల్స్ , వాలీబాల్ నెట్, రెండు బంతులు, రెండ్ ఫుట్ బాల్స్, రెండు హ్యాండ్ బాల్స్ కొనుగోలు చేయాలని సూచించింది.

అవకతవకలకు పాల్పడితే చర్యలు



ప్రభుత్వ పాఠశాలలకు మంజూరైన క్రీడానిధులతో ఏఏ ఆటవస్తువులు కొనుగోలు చేయాలో మార్గదర్శకాలు విడుదల చేశాం. ఆట వస్తువులను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు మాత్రమే కొనుగోలు చేయాలి. ఆ వివరాలు స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలి. నిధులు సక్రమంగా వినియోగించుకునేలా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాం. ఉన్నత పాఠశాలల్లో ఎంఈఓలు పర్యవేక్షించనున్నారు. ఆట వస్తువులను వినియోగిస్తూ వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి. కొనుగోళ్లలో అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటాం.

–వెంకటేశ్వరాచారి, భద్రాద్రి డీఈఓ

జిల్లా అథ్లెటిక్స్ జట్లు సిద్ధం



షాట్‌పుట్ వేస్తున్న క్రీడాకారిణి

ఖమ్మంస్పోర్ట్స్: జిల్లాస్థాయి అథ్లెటిక్స్ జట్లను ఆదివారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఎంపిక చేశారు. జిల్లావ్యాప్తంగా 80 మంది అథ్లెట్లకు పైగా హాజరవగా.. జిల్లాజట్టులో స్థానం పొందినవారు ఈ నెల 18, 19 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి అండర్–14, 16, 20, యూత్ పోటీల్లో పాల్గొననున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎండీ షఫీక్‌అహ్మద్ తెలిపారు. అండర్–14 బాలుర జట్టులో పి.అభిషేక్, జి.వరుణ్ (ఖమ్మం), చరణ్‌గౌడ్(కొణిజర్ల), వై.మనోహర్, ఎండీ అదాన్ (తనికెళ్ల), అండర్–16 జట్టులో లోకేశ్ (ఏన్కూరు), ఎస్‌డీ అష్రాఫ్ (ఖమ్మం), ఎస్‌కే అర్షద్ (తనికెళ్ల), అండర్–18 జట్టులో జె.అనిల్ (పిండిప్రోలు), జీవీ సాయి (నేలకొండపల్లి), కె.అశోక్, వినయ్(ఖమ్మం), అండర్–20 జట్టులో ఎస్‌కే ఆఫబ్యూబ్ (ఖమ్మం), వేణు (కుంచపర్తి) ఎంపికయ్యారు.

బాలికల విభాగం : అండర్–14లో కె.తేరిసా (ఖమ్మం), అండర్–18లో బి.వైష్ణవి, డి.బిందు, పి.దీక్షిత (ఖమ్మం), రాజరాజేశ్వరి (నేలకొంపల్లి), అండర్–20లో హజీరాఫాలిమా, అమానానాజ్ (ఖమ్మం) ఉన్నారు. కార్యక్రమంలో ఖమ్మం అథ్లెటిక్స్ అకాడమీ చీఫ్ కోచ్ ఎండీ గౌస్, ఎన్.వెంకటేశ్వర్లు, డి.రవికుమార్, ముజాహిద్, తిరుపతి పాల్గొన్నారు.

‘అక్షరాల తోవ’ విజేతలకు పురస్కారాలు



అక్షరాల తోవ కథలు, కవితల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలోని జిల్లా పరిషత్ సమావేశపు హాల్‌లో ఆదివారం జరిగిన అక్షరాల తోవ ఏడో వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కథలు, కవితల పోటీల్లో విజేతలుగా నిలిచినవారికి పురస్కారాలు ప్రదానం చేశారు. సాహితీ సంస్థ నిర్వాహకులు నామా పురుషోత్తం అధ్యక్షతన విజేతలుగా నిలిచిన కథలు, కవితలతో ప్రచురించిన పుస్తకాన్ని రిటైర్డ్ హెచ్‌ఎం పరిశ సీతారత్నం, ట్రస్ట్ వ్యవస్థాపకులు పరిశ పుల్లయ్య, స్పర్శ సామాజిక అధ్యయన కేంద్రం చైర్మన్ స్పర్శభాస్కర్ ఆవిష్కరించి మాట్లాడారు. సమాజంలో మార్పులు గమనిస్తూ పీడితుల పక్షాన నిలిచే కవిత్వాన్ని ప్రోత్సహించటం అభినందనీయమన్నారు. ప్రశ్నించే తత్వం, శాస్త్రీయ పరిశీలనను పెంపొందించే రచనలు రావాలన్నారు. అనంతరం జీవీవీ రాష్ట్ర నాయకులు అలవాల నాగేశ్వరరావు, కవి, విమర్శకులు సైదులు ఐనాల మాట్లాడుతూ.. సైన్స్‌ను బలపరుస్తూ కవిత్వం రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తర్వాత రచయిత్రి పురిమళ్ల సునంద, వ్యక్తిత్వ వికాస నిపుణులు తాళ్లూరి లక్ష్మీ, రచయిత, గాయకుడు యోచన, సినీ దర్శకులు కొత్తపల్లి శేషు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో విజేతల కథలు, కవితలతో రూపొందించిన పుస్తకాన్ని రాచమళ్ల ఉపేందర్ పరిచయం చేశారు. సామాజిక వేత్త అన్నం శ్రీనివాసరావును సత్కరించారు. దాసరోజు శ్రీనివాస్, కవులు సయ్యద్ షఫీ, క్నైగంటి వెంకటయ్య, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, కంచర్ల శ్రీనివాస్, ఇబ్రహీం, నిర్గుణ్, పెద్దోజు నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

అడవి, వృక్షాలపై అవగాహన



రామయ్యతో విద్యార్థులు, అటవీశాఖ అధికారులు

పెనుబల్లి: మండలంలోని బ్రహ్మళకుంట పులిగుండాల ప్రాజెక్టును ఏన్కూరు గురుకుల పాఠశాల విద్యార్థులు ఆదివారం వనదర్శిని కార్యక్రమంలో భాగంగా సందర్శించారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య విద్యార్థులకు చెట్ల ఆవశ్యకత, సకల జంతువుల జీవన విధానం, జీవరాశుల ప్రాముఖ్యతను వివరించారు. ఖమ్మం అన్నం ఫౌండేషన్ నిర్వాహకులు శ్రీనివాస్ చదువుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌ఓ జి.ఉమ, డీవైఆర్‌ఓలు సురేశ్‌కుమార్, రాంసింగ్, ఎఫ్‌ఎస్‌ఓ కాలు, ఎఫ్‌బీఓలు లావణ్య, నాగరాజు, సమత, ప్రసాద్, శ్రీను, అజామలి, మస్తాన్ తోపాటు సుమన్, జానీ, రాములు పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్ పేరుతో నరమేధం

మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు..

ఖమ్మం మామిళ్లగూడెం : ఛత్తీస్‌గఢ్‌లోని ఇంద్రావతి నేషనల్ పార్క్‌లో ఆదివారం ఎన్‌కౌంటర్ పేరుతో పోలీసులు నరమేధం సృష్టించారని, దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎదురుకాల్పుల్లో 31 మంది మావోయిస్టులు మృతిచెందినట్టు పోలీసులు చెబుతున్నారని, మృతుల సంఖ్య ఇంకా పెరగొచ్చని అంటున్నారని, అయితే ఇందులో మావోయిస్టులు ఎందరో, అమాయక ఆదివాసీలు ఎందరో అనే వివరాలు తెలియాల్సి ఉందని పేర్కొన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో విదేశీ శత్రువులపై యుద్ధం ప్రకటించినట్టుగా కేంద్ర ప్రభుత్వం బస్తర్ పైన, మావోయిస్టు ఉద్యమం పైనా విరుచుకుపడుతోందని ఆరోపించారు. 70 వేల మంది బలగాలు, స్పెషల్ ఆపరేషన్ టీమ్‌తో అడవిని జల్లెడ పడుతున్నారని, ఆదివాసీ గ్రామాలను తగలబెడుతున్నారని పేర్కొన్నారు. నక్సలైట్ ఉద్యమాన్ని సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యగా కాకుండా అంతర్గత భద్రతా ప్రమాదంగా చిత్రీకరిస్తున్నారని, ఛత్తీస్‌గఢ్‌లో జరిగే నరమేధంపై నిరసన తెలపకుంటే బీజేపీ, ఫాసిస్టులు ఇక ముందు ప్రజాస్వామికవాదులు, భిన్న సంస్కృతులు, భిన్నాభిప్రాయాలు ఉన్న వారిని సైతం ఇలాగే నిర్మూలిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్‌కు గాయాలు



తీవ్రగాయాలపాలైన ఆటో డ్రైవర్ శివశంకర్

పెనుబల్లి: మండలంలోని మండాలపాడు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్‌కు తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. మండలంలోని లింగగూడెం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ ఇడుపుల శివశంకర్ వీఎంబంజర్ వైపు వస్తూ కారును ఓవర్ టేక్ చేయబోగా వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఆటో అదుపుతప్పి పల్టీలు కొట్టగా.. ఆటోడ్రైవర్ శివశంకర్ రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో సత్తుపల్లి వైపు నుంచి ఖమ్మ వైపు వెళ్తున్న లారీ టైర్లు శివశంకర్ మోచేతి పైనుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ అప్రమత్తంగా ఉండటంతో ప్రమాదం తప్పింది. క్షతగాత్రుడిని ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

బైక్ కొనివ్వలేదని.. యువకుడి ఆత్మహత్య



ప్రవీణ్ (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: ద్విచక్ర వాహనం కొనివ్వలేదని ఓ యువకుడు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. స్థానిక ఎస్సై యయాతి రాజు కథనం ప్రకారం.. పట్టణ పరిధిలోని ఫైర్ కాలనీకు చెందిన చీకటి స్వామి(20) కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అయితే తనకు బైక్ కొనివ్వాలని తల్లిదండ్రులతో గత కొద్ది రోజులుగా గొడవపడుతున్నాడు. ఈ క్రమంలో స్థానిక అగ్ని మాపక కేంద్రంలో స్వీపరుగా పని చేసే తల్లి వరలక్ష్మి కేంద్రానికి వెళ్లగా.. అదే సమయాన స్వామి తల్లి వద్దకు వెళ్లి ఖర్చులకు డబ్బులు అడుగగా.. ఇంటికి వచ్చాక ఇస్తానని చెప్పడంతో ఆమెతో వాగ్వాదం పెట్టుకున్నాడు. అక్కడి నుంచి ఇంటికి వెళ్లి మనస్తాపంతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పనులు ముగించుకుని ఇంటికి వెళ్లిన తల్లి చూసే సరికి ఉరివేసుకొని కనిపించడంతో గట్టిగా కేకలు వేయడంతో చుట్టు పక్కల వా రంతా అక్కడకు వచ్చి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. దీంతో తండ్రి కొండయ్య చేసిన లిఖిత పూర్వక ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, దంపతులకు ఒక్కడే సంతానం కావడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడికి ఇంకా వివాహం కాలేదు.

తల్లితో గొడవపడి బాలిక...

భద్రాచలంఅర్బన్: తల్లితో గొడవపడి ఓ బాలిక (14) ఆత్మహత్య చేసుకుంది. భద్రాచలం టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న సంఘటన వివరాలను పోలీసులు ఇలా తెలిపారు. పట్టణంలోని ఎంపీ కాలనీకి చెందిన 9వ తరగతి చదువుతున్న ఓ బాలిక శనివారం రాత్రి తన తల్లి విజయలక్ష్మితో గత రెండు, మూడు రోజుల నుంచి చిన్న చిన్న గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఆ బాలిక తట్టుకోలేక ఆదివారం ఇంట్లో చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతిరాలి తల్లి ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలుకింద పడి వ్యక్తి...

మధిర: మధిర రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం ఓ వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం పెనుగొలను గ్రామానికి చెందిన కొత్తూరు ప్రదీప్‌కుమార్ (34) వ్యక్తిగత కారణాలతో కిలోమీటర్ నంబర్ 529/16–18 వద్ద దిగువ లైన్‌లో వెళ్తున్న జైపూర్ – చెన్నై ఎక్స్‌ప్రెస్ రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఖమ్మం రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేధిస్తున్న వ్యక్తిపై కేసు

కారేపల్లి: దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కారేపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి (సంతగుడి) దేవాల య సిబ్బందిని వేధిస్తున్న కారేపల్లి గ్రా మానికి చెందిన వాసురెడ్డి సంపత్‌కుమార్‌పై కారేపల్లి పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథ నం ప్రకారం.. కారేపల్లిలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం సమీపంలో నివా సం ఉండే వాసిరెడ్డి సంపత్‌కుమార్ దేవాలయ జూనియర్ అసిస్టెంట్లు రాందాస్, మూడ్ మోహన్‌ల విధులను ఆటంకపరుస్తూ, వారిని మానసికంగా వేధింపులకు గుర్తిచేస్తున్నాడు. బాధితుల ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

దాడి చేసిన వ్యక్తిపై...

రఘునాథపాలెం: అత్త, బావమరిదిపై దాడి చేసిన అల్లుడిపై కేసు నమోదు చేశామని సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు. మండలంలోని పువ్వాడ నగర్‌కు చెందిన వి.వేణు ఇంటిపక్కనే ఉన్న అత్తారింటికి వెళ్లాడు. మద్యం మత్తులో అత్తతో ఘర్షణ పడి దాడి చేశాడు. బావమరిది ఎం.బ్రహ్మచారి అడ్డుకోబోగా ఆయనపై కూడా దాడి చేశాడు. బ్రహ్మచారి ఫిర్యాదు మేరకు వేణుపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

రెండు బైకులు ఢీ

రఘునాథపాలెం: మండల కేంద్రంలోని యాపిల్ సెంటర్‌లో ఆదివారం యూటర్న్ తీసుకుంటున్న బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ శ్రీను ద్విచక్రవాహనాన్ని మరో ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో వాహనాలు దెబ్బ తినడంతోపాటు కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. కానిస్టేబుల్ ఫిర్యాదుపై రఘునాథపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

ఖమ్మంఅర్బన్: నగరంలోని ధంసలాపురం వద్ద ఫ్లై ఓవర్‌పై ఆదివారం కారు ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో భవాని (21) తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ ఘటనపై ఖమ్మంఅర్బన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. ముస్తఫానగర్‌కు చెందిన బోడింక వినయ్, భవాని దంపతులు ద్విచక్రవాహనంపై ఏపీలోని పెనుగంచిప్రోలు దేవాలయంలో కొత్త ద్విచక్ర వాహనానికి పూజ చేయించేందుకు వెళ్తున్నారు. ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టడంతో వినయ్, భవాని తీవ్రంగా గాయపడగా.. ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ భవానీ మృతి చెందింది. మృతురాలి తండ్రి సైదులు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా, వినయ్, భవానికి వివాహమై 10 నెలలు అవుతోంది.

తోగ్గూడెం గ్రామంలో వృద్ధురాలు..

మణుగూరుటౌన్: రోడ్డు దాటుతుండగా మోటార్‌సైకిల్ ఢీకొని ఓ వృద్ధురాలు మృతిచెందింది. స్థానికుల కథనం ప్రకారం.. తోగ్గూడెం గ్రామానికి చెందిన భూక్య కమలమ్మ(69) శనివారం రాత్రి రోడ్డు దాటుతుండగా, మణుగూరు నుంచి అశ్వాపురం వైపు వెళ్తున్న ఓ మోటార్ సైకిల్ ఢీ కొట్టింది. ఈ సంఘటనలో వృద్ధురాలికి తీవ్రగాయాలు కాగా, సింగరేణి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందిందని, మోటార్ సైకిల్ నడిపిన వ్యక్తికి తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రిలో వైద్యం పొందుతున్నాడు. కాగా, విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాయం మృతురాలి నివాసానికి వెళ్లి నివాళులర్పించారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న ఆనాటి విద్యార్థులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని గాంధీచౌక్‌లో ఉన్న స్వామి వివేకానంద ట్యుటోరియల్ కాలేజీలో 1983–84లో పదో తరగతి చదివిన మిత్రులు ఆదివారం కలుసుకున్నారు. 1984లో పదో తరగతి పూర్తయ్యాక తలోదారి వెళ్లిపోయి వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. అందరూ కలుసుకోవాలని వెగ్గళం శ్రీనివాస్, చెరుకూరి మురళి, కోసు రమేశ్‌గౌడ్, బండి రమేశ్, అందె శ్రీనివాసరావు, కాసాని శ్రీనివాస్, హనుమంతరావు కృషి చేశారు. దీంతో 40 ఏళ్ల తర్వాత ఖమ్మంలోని ఓ హోటల్‌లో పూర్వ విద్యార్థులంతా కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

పింఛన్ మంజూరు చేశారు.. ఇవ్వడం మరిచారు



దివ్యాంగురాలు మహ్మద్ నస్రీన్

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం తుంబూరుకు చెందిన మానసిక, శారీరక దివ్యాంగురాలైన మహ్మద్ నస్రీన్‌కు పింఛన్ మంజూరు చేస్తున్నట్లు లేఖ ఇచ్చిన అధికారులు ఖాతాలో నగదు మాత్రం జమ చేయడం లేదు. ఆమెకు 2022 జూలై 7న పింఛన్ మంజూరు చేస్తున్నట్లు కోడ్ కేటాయించడమే కాక పెన్షన్ రూ.4,016 ఇవ్వనున్నట్లు కార్డు జారీ చేశారు. అయితే, రెండేళ్లు గడిచినా ఇప్పటివరకు ఆమె ఖాతాలో నగదు జమ కాలేదని నస్రీన్ భర్త మహ్మద్ ఖలీల్ వాపోయారు. ఈ విషయమై సత్తుపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఆతర్వాత ఖమ్మం డీఆర్‌డీఓ కార్యాలయంలో సంప్రదించగా తమకు అనుమతి రాలేదని చెప్పడంతో మరోమారు కలెక్టరేట్‌లో దరఖాస్తు చేసినట్లు తెలిపారు. 70శాతం వైకల్యంతో మంచానికే పరిమితమైన నస్రీన్‌ను కార్యాలయానికి తీసుకెళ్లే పరిస్థితి లేనందున తమకు న్యాయం చేయాలని ఆయన కోరారు.